'.....ఎక్కడుందో మాకూ తెలియదు. ఏ విషయమైనా పూర్తిగా చెబితేగా....'

'హలో మిసెస్ కిరీటి...' ఎవరో సూట్‌వాలా ఇంటరప్షన్‌తో వారి చర్చ ఆగిపోయింది.

'ప్లీజ్ డు కమ్ హియర్.'

చేతిలో ఫ్లాష్ కెమేరాతో కిరీటి వెపు చూపించేసరికి అయిష్టంగా కిరీటి ప్రక్కకు వెళ్ళి నిలబడింది.

'అలా కాదు... ఎబిట్ క్లోజర్...'

నడుంపై కిరీటి చేయి పడగానే ఉలిక్కిపడింది.

శరీరంలో ఏదో గగుర్పాటు.... సన్నని ప్రకంపన....

ఉక్రోషంగా కిరీటి వైపు చూసింది.

'ప్లీజ్ కొన్ని క్షణాల పాటు నా పరువు కాపాడు అని అతని పెదవులు గొణుగుతుంటే పెదవులకు చిరునవ్వు పులుముకుంది.

ఫ్లాష్ క్లిక్ మంది...

అంతటా చప్పట్లు...

మరెవరో రిక్వెష్టు...

ఈసారి ఆమెను పొదివి పట్టుకుని హత్తుకున్నట్టుగా నిలబడ్డాడు.

మళ్ళీ కెమారా క్లిక్ మంది.

అతని స్పర్శ ఆమెలో అలజడిని సృష్టిస్తోంది.

అతని ప్రవర్తన ఆమెలో ఉన్మాదాన్ని రేపుతోంది.

నిస్సత్తువుగా అతని గుండెలపై వాలిపోవాలని, మరింతగా అతనిలో ఐక్యమై పోవాలని...

బలంగా అతన్ని పెనవేసుకు పోయిన ఆమె చేతుల్ని మృదువుగా విడదీశాడు.

చిలిపిగా విచ్చుకున్న అతని పెదవులు పలికిన భాషకు ఆమె సిగ్గుపడింది.

ఛీఛీ .... తనింత చపలచిత్తురాలైందేమిటి.

తనెందుకిలా ఓడిపోతోంది.

పార్టీముగిసేంతవరకూ గుంభనంగా ఉండిపోయింది.

అలసట లేకుండా అంతటా తానై హుషారుగా తిరుగుతున్న కిరీటి వేపు తదేకంగా చూసింది.

ఏమిటి... అతన్ని చూస్తుంటే ఏదోమైకం కలుగుతోంది. తొలి స్పర్శలోని గిలిగింతా లేక తనకు తెలియకుండానే అతనిపై ఆరాధన పెరుగుతుందా....

అలా కానినాడు గతంలోని అతని ఎఫైర్ గురించి ఆరా తీయాలని ప్రయత్నించిందెందుకు.

ఇందాక అతన్ని విదిలించుకోలేక గువ్వలా ఒదిగి పోయిందెందుకు..

నిజంగా కిరీటికి గతంలో మరేదన్నా కథ ఉందా

సరిగ్గా ఈ ఆలోచన ముందు ఆమె అహంకారం ఘోరంగా ఓడిపోయింది.

బఫేలో ఎక్కువగా తినలేకపోయింది.

కిరీటి ఎంత బ్రతిమిలాడినా ప్రయోజనం లేకపోయింది. ముఖావంగానే ఉంది.

ఇంటికి వచ్చాక అలసటగా సోఫాలో వాలిపోయింది.

డ్రెస్ చేంజ్ చేసుకు వచ్చిన కిరీటి ఆమెను తదేకంగా చూస్తూ ఉండిపోయాడు.

కళ్ళు తెరిసిన శిల్ప తన గదిలోకి వెళ్ళబోతుంటే "పార్టీలో తప్పని సరై నేను తీసుకున్న చొరవకు క్షమిస్తావను కుంటాను" అన్నాడు మరెటో చూస్తూ.

ఆమెకింగా మగతగానే వుంది.

"ఎవరైనా అనిచితంగా నీకు నచ్చని పద్ధతిలో ప్రవర్తిస్తే వాళ్ళతరుపున నేను క్షమాపణలు చెప్పుకుంటున్నాను."

అతను అదే పనిగా క్షమించమని ప్రాధేయపడుతుంటే ఆమెకు పట్టరానంత ఉడుకుమోత్తనం వేసింది.

"ఛీఛీ... సంస్కారంలేని మనుషులు......'

ఆమె ఎవర్ని ఉద్దేసించి ఆమాటలన్నదో అతనికి అర్ధంకాలేదు...

"జయశ్రీ ఏమైనా నోటికొచ్చినట్టు మాట్లాడిందా..."

"ఏం అంతా చెప్పేసిందని భయంగా వుందా...."

శిల్ప 'అంతా'అంటూ మరీ నొక్కి పలకటంతో అతని కనుబొమ్మలు ముడిపడ్డాయి.

అనవసరంగా తను నాలిక జారాననిపించిందామెకు.

"ఛీఛీ...కల్చర్ పేరిట మగాళ్ళను కొరకొరా చూడటాలూ... సివిలైజేషన్ పేరిట చిల్లరగా ప్రవర్తించటాలూ... అది పార్టీయా లేక ఫ్యాషన్ పెరేడా... సిగ్గు ఎగ్గులు, వయసు తారతమ్యాలూ చూడకుండా..."

ఆయాసం వచ్చినట్టు ఆగిపోయిన శిల్ప చూడముచ్చటగా అనిపించింది.

"అరిస్టోక్రాట్ ఫేమిలీస్‌లో ఆడవాళ్ళు అలాగే ప్రవర్తిస్తుంటారు."

"నేను అంతకంటే పెద్ద ఫేమిలీకి చెందినదాన్ని... రాజానరేంద్రదేవ్ మనువరాల్ని."

"అఫ్‌కోర్సు..... అది నిజమే ...." చిలిపిగా జవాబిచ్చాడు.

"నిజం కాబట్టే సంస్కారవంతురాలిగా ప్రవర్తించాను. లేకపోతే 'హాయ్ కిట్టి' అంటూ మిమ్మల్ని కావలించుకున్న ఆ జయశ్రీ చెంపను అక్కడే పగలకొట్టేదాన్ని."

'అసూయ మైక్రోస్కోప్‌లో చూస్తుంది. అభిమానం టెలిస్కోప్‌లో చూస్తుంది' అన్న వాక్కులు గుర్తుకొచ్చాయి కిరీటికి.

శిల్ప తన విషయంలో అసూయ పడటం ఆహ్లాదకరంగా హాయిగానూ వుంది.

"అయినా నేనెవరితో ఎలాపోతే నీకెందుకు?"

మరో అస్త్రాన్ని ప్రయోగించాడు.

“ఎందుకు అని సరిపెట్టుకుంటే నేనెందుకింత బాధ పడతాను”

ఆవేశంగా అనేసిన శిల్పకు తనేమన్నదీ మరోసారి గుర్తుకొచ్చేసరికి సిగ్గుతో చెక్కిళ్ళు ఎరుపెక్కాయి.

తొందరగా తన గదిలోకి వెళ్ళబోతుంటే అడ్డంగా నిలబడ్డ కిరీటి ఆమె భుజాలను పట్టుకున్నాడు.

“ప్లీజ్ నన్ను వదలండి.”

నీరసంగా పెనుగులాడింది.

“ఐనో. నీకు నేనంటే ఇష్టం...యూ లైక్ మి...”

కోర్కెతో నిండిన అతని కళ్ళల్లోకి చూస్తుంటే ఆమె శరీరం కాలిపోతున్నట్టుగా సెగల్ని చిమ్ముతుంది.

బలవంతంగా నిగ్రహాన్ని కూడదీసుకుంది.

“ఐ హేట్ యు...” ఆమె పెదవులదురుతున్నాయి.

“యూ కాంట్ ...” ఆమెను మరింత దగ్గరగా లాక్కున్నాడు.

శరీరం ప్రతికూలిస్తూ బలిమితో బలాన్ని కూడ గట్టుకుంది. అతని చేతుల్ని విదిలించుకొని దూరంగా జరిగి నిలబడింది.

“ప్రతి క్షణమూ నన్నెందుకిలా పరీక్షిస్తున్నావు ...” అంటూ అసహనంతో ఊగిపోయాడు.

“అదే నేనూ అడుగుతున్నాను... ఎన్నో ఎఫైర్స్ నడిపిన మీరు నన్నెందుకు కట్టుకున్నారు....”

“శిల్పా! నువ్వు విన్నదంతా అబద్ధం”

“కాదు ....పచ్చి నిజం... మీకు ఆడపిల్లల జీవితంతో ఆడుకోవటం హాబీ. ఆడదాని బ్రతుక్కి ఖరీదు కట్టి అనుభవించి విసిరిపారేయటం మీకో ఫేషన్... అందుకే నిన్న ఒక ఆడపిల్లకు అన్యాయంచేసి ఇవాళ నామెడకు ఉరిత్రాడు బిగించారు...”

“యస్.... నువ్వనుకున్నది నిజం.”

క్రోధంతో అతడి పిడికిళ్ళ బిగుసుకున్నాయి.

“నాకు అమ్మాయిల జీవితాలతో ఆడుకోవటం నా హాబీ. నీలా పొగరెక్కిన ఆడపిల్లల అహాన్ని అణచివేయటం ఫేషన్. అందుకే కావాలని నిన్ను కట్టుకున్నాను” హుంకరిస్తున్నట్టుగా అన్నాడు.

“అది నాకు ముందే తెలుసు మిష్టర్ కిరీటి... చెప్పండి... ఎవరు మీరు... నేను మీకెలా తెలుసు.... ప్రపంచంలో ఇంతమంది అమ్మాయిలుండగా వలపన్ని నన్నే ఇరికించడంలో మీ ఉద్దేశ్యం ఏమిటి..... దీని వెనుకనున్న గూడుపుఠాణీకి అర్థం చెప్పండి” ఉద్వేగంతో అడిగింది.

“చెప్తాను శిల్పా... నీ అహంకారం పూర్తిగా దిగి పోయిన రోజు నేనెవరో నిన్నెందుకు ఇలా ట్రాప్ చేశానో అంతా చెబుతాను.”

చరచరా బయటికి నడిచాడు.

స్థాణువులా నిలబడిపోయింది శిల్ప.

అతనిపైబడి రక్కేయాలన్నంత కోపంవచ్చినా అసహాయంగా ఏడ్చుకుంటూ మిగిలిపోయింది.

9

హఠాత్తుగా అర్ధరాత్రి మెలకువ వచ్చింది శిల్పకు...

మనసులో ఏదో గుబులు....

పార్టీ అయిన వారం రోజులనుండీ కిరీటి ముభావంగా వుండటం ఒకరోజు తనకోసం అతడు తీసుకు వచ్చిన జ్యూయలరీని తను విసిరికొట్టడం, ఆ తర్వాత అతడు మరింత దూరదూరంగా తప్పించుకు తిరగటం గుర్తుకు వచ్చింది.

తను ఎంత అనుచితంగా ప్రవర్తిస్తున్నా అతడెందుకు క్షమిస్తున్నట్టు.....

తనకోసం, తనను మెప్పించటం కోసం ఇంకా ఎందుకు ప్రయత్నిస్తున్నట్టు...

ఆమెకు ఆ రోజు డైనింగ్‌హాల్లో డిన్నర్ చేస్తుండగా కిరీటి ప్రవర్తించిన తీరు గుర్తుకొచ్చింది.

వారం రోజులుగా అతడెందుకు తప్పించుకు తిరగుతున్నదీ అడగాలనిపించి ఒకటీ రెండూ సార్లు అతన్ని క్రీగంటచూసింది.

అతను పలకరిస్తే మాట్లాడాలనిపించింది.

కాని తన ఉనికినే గుర్తించనంతగా అతను తలవంచుకొని భోంచేసి వెళ్ళిపోగా తను మధ్యలోనే వెళ్ళిపోయింది.

ఏమిటతని తలబిరుసు...

తానేం తక్కువది కాదు...

రాజానరేంద్రదేవ్ మనువరాలు...

దూరంగా సముద్రపు హోరు తప్ప మరే అలికిడి వినిపించటంలేదు.

కిరీటిని చూడాలనిపించింది.

రేడియం డయల్ రిస్ట్ వాచి రాత్రి రెండుగంటల్ని చూపిస్తోంది.

వశం తప్పినట్టుగా పైకి లేచింది.

అడుగులో అడుగు వేసుకుంటూ నెమ్మదిగా తలుపు తెరచి కిరీటి గదిలోకి వచ్చింది.

బెడ్‌పై కిరీటి లేడు.

ఎక్కడకి వెళ్ళారు చెప్మా అనుకుంటూ లైబ్రరీ రూం వేపు నడిచింది.

అక్కడా చీకటిగా ఉంది.

వెనక్కి మరలి వస్తుంటే గదిలో లైటు వెలుగుతోంది.

అదే కిరీటి ప్రైవేటుగది. ఇంతవరకూ శిల్ప అందులోకి అడుగుపెట్టలేదు.

నౌకర్లు కూడా ఆ గదిలోకి వెళ్ళటానికి సాహసించరని ఆమెకు తెలుసు.

కిరీటి ఏం చేస్తున్నాడో చూడాలన్న ఉత్సుకత....

వార్డ్ రోబ్ ప్రక్కకున్న అద్దం ద్వారా లోపలికి చూసింది.

కిరీటి తదేకంగా ఏదో ఫొటో ఆల్బం చూస్తున్నాడు.

ఆమెకు హఠాత్తుగా జయశ్రీ అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

ఒక వేళ మాజీ ప్రియురాలి ఫొటోను చూస్తున్నాడేమో...

ఆ ఆలోచన రాగానే అక్కడికెలాగైనా వెళ్ళి ఆల్బంను బలవంతంగా లాక్కుని చూడాలనిపించింది.

తనకంటే ఆమె ఎందులో ఉన్నతురాలో కంపేర్ చేసుకోవాలనిపించింది...

ఒకవేళ అదీ కాకపోతే...?

ఆమెకు ఉక్రోషంతో ఏడుపొచ్చింది.

ఎవరు ఎలాపోతే తనకెందుకు...?

ఒక్క తాళి తప్ప తనకీ ఆయనకీ మధ్య అనుబంధమేముందని?

అతడినెంతో ద్వేషించే తను రోజు రోజుకీ ఎందుకిలా మారిపోతుంది.

దూరంగా ఉండాలనుకుంటూనే చేరువకోసం ఎందుకు తపిస్తోంది.

తనకేమౌతోంది...

“రాజానరేంద్రదేవ్ మనువరాలయిన శిల్పాదేవి గారూ... ఇంత రాత్రి వేళ....”

కిరీటి కంఠం వినపడగానే ఉలిక్కిపడిపోయింది.

ఏం చెప్పాలో పాలుపోక కొంతసేపు తొట్రుపాటుతో దిక్కులుచూస్తూ ఉండిపోయింది.

“ప్రైవేట్ రూంలోకి చూడటం సభ్యత కాదని మీకు చెప్పాల్సిన పని లేదనుకుంటా....”

అతని వ్యంగ్యానికి ఆమె ఎప్పటిలా విరుచుకుపడుతూ జవాబు చెప్పలేదు.

అతడు తన జీవిత రహస్యాల గురించి నిజాయితీగా చెప్తే అంతా విని అతడ్ని ఓదార్చాలనిపించింది.

అతడు చూస్తున్న ఫొటో ఎవరిదో అడగానిపించింది.

అయినా ఆత్మాభిమానం అడ్డు రావటంతో మౌనంగా ఉండిపోయింది.

“చెప్పండి మేడం...”

అతని కొత్త సంభోధానికి ఉడుకుమోత్తనంతో అతని కేసి చూసింది.

“వాట్ హెల్ప్ కెన్ ఐ డూ ఫర్ యు...” అతి సాధారణంగా అడిగాడు.

ఏదో చెప్పాలి .. లేకపోతే అతడు తనని అపార్థం చేసుకోవచ్చు... పిచ్చిదానిలా అతని వెంట పడుతున్నట్టు అనుకోవచ్చు...

“నేను మా ఊరు వెళ్తాను ...“ నేలచూపులు చూస్తూ అంది.

వచ్చింది అందుక్కాదులే అన్నట్టుగా మర్మంగా మందహాసం చేశాడు.

"రేపు ఆలోచించి చెప్తాను."